క్లుప్తంగా

పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 7వ తేది గురువారం నుంచి 9వ తేది వరకూ స్వామి వారికి, అమ్మవారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మూడు రోజులపాటు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు పర్యవేక్షణలో పవిత్రోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

చెత్తకు నిప్ప ..కాలిపోయిన విద్యుత్, కేబుల్ తీగలు



చెత్తకు నిప్పంటుకుని కాలిపోయిన విద్యుత్, కేబుల్ వైర్లు

భీమవరం: చెత్తకు నిప్పంటుకుని భీమవరం పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలోని విద్యుత్, కేబుల్ తీగలు అగ్నికి ఆహుతయ్యాయి. పట్టణంలోని ప్రతి రోజు మునిసిపల్ పారిశుధ్య కార్మికులు వీధుల్లోని రోడ్లను శుభ్రంచేసి చెత్తను తొలగించాల్సి ఉంది. అయితే బుధవారం ఉదయం హౌసింగ్‌బోర్డులోని జంక్షన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం వద్ద చెత్తను గుట్టగావేయడంతో దానికి నిప్పంటుకుని పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీనితో విద్యుత్ స్తంభం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్స్ బాక్స్, గృహాల్లోని విద్యుత్ సర్వీస్ తీగలు, కేబుల్ వైర్లు కాలిపోయాయి. అగ్నిప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపుచేసినట్లు ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు చెప్పారు. మంటలకు గృహాలకు వెళ్లే విద్యుత్ సర్వీస్ తీగలు కాలిపోవడంతో పరిసర ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లకు సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జీతాలిప్పించాలని 104 ఉద్యోగుల వినతి



ఉండిలో వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

ఉండి: మా కుటుంబాలు రోడ్డున పడకుండా కూటమి ప్రభుత్వం జీతాలు ఇప్పించి ఆదుకుని న్యాయం చేయాలంటూ 104 ఉద్యోగులు బుధవారం ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తున్న తమకు కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 104 వాహనాలను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో రూ.50 వేల ఖర్చుతో నిర్వహించాలని డిమాండ్ చేసారు. 2020లో విధుల్లో చేరిన డ్రైవర్, డేటాఎంట్రీ ఆపరేటర్‌లకు జీవో నంబర్ 7 ద్వారా జీతాలు ఇప్పించాలన్నారు. అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు చేట్ల ఆర్ఎం విజయ్‌కుమార్, కమిటీ పైలట్ నాయుడు, డీఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



పెనుగొండలో కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మహిళలు ఆర్థికంగా బలపడిన నాడు కుటుంబంతో పాటు, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని కరూర్ వైశ్యాబ్యాంక్ తణుకు బ్రాంచి మేనేజరు వీఎస్ చైతన్య అన్నారు. మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరూర్ వైశ్యా బ్యాంక్ ఆర్థిక సౌజన్యంతో ఆరు నెలలు పాటు శిక్షణ పొందిన 100 మహిళలకు పెనుగొండలో కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. మై పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మాదిరెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలన్నారు. స్వయంశక్తితో శక్తివంతం కావాలని పిలుపునిచ్చారు.

పండు 'గొప్పే'

- తీర ప్రాంతాల్లో విస్తరిస్తున్న పెంపకం
- కిలో రూ. 360 కొనుగోలు
- పండు చేపను పెంచేందుకు మొగ్గు చూపుతున్న ఆక్వా రైతులు

భీమవరం అర్బన్: జిల్లాలో తీర ప్రాంత గ్రామాల్లో పండు చేప పెంపకం విస్తరిస్తోంది. ఈ చేపకు దేశ, విదేశాలలో గిరాకి ఏర్పడి చేప ధర పెరగడంతో ఆక్వా రైతులు చేప పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో భీమవరం, మొగల్తూరు, నరసాపురం, కాళ్ల మండలాల్లో సముద్రం, ఉప్పుటేరు తీర ప్రాంతాలలో ఈ పండుగొప్ప చేపలను వర్షాకాలంలో సుమారు 2 వేల 500 ఎకరాలలో పెంచుతున్నారు. ఈ చేప సప్ప, ఉప్పు నీటిలో పెరగడంతో తీర ప్రాంత గ్రామాలలో ఎక్కువగా పెంపకం చేస్తున్నారు. సాధారణంగా బతుకున్న చిన్న చేపలను వేటాడి ఈ చేప తింటుంది. సముద్రంలో పడవల ద్వారా చిన్న చేపలను వేటాడి వీటికి మేతగా వేస్తున్నామని రైతులు చెబుతున్నారు. వనామీ రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, ఈహెచ్‌పీ తదితర వైరస్‌లతో నాణ్యమైన సీడ్ దొరకకపోవడంతో వనామీ సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతులు పండుచేప పెంపకం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు.



పండు చేపలకు వేసే చైనా గొరకలు, చిన్న చేపలు

కేజీ నుంచి 4 కేజీల వరకు రూ. 360

సప్ప, ఉప్పు నీటిలో పెరిగే పండుచేప కేజీ నుంచి 5 కేజీలు పెరిగితే కేజీ రూ. 360లు పైగా దాటితే 380 ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ చేపలను ఔరా, ముంబాయి, గోవా, కోల్‌కత్తా, బీహార్, ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తుంటారు. లోతు ఎక్కువగా ఉన్న ఎకరం చెర్వులలో 1000నుంచి 1500 వరకు పండుచేప పిల్లలను వదులుతామని వీటికి ఆహారంగా చైనా గొరకలు, చిన్న చేపలను ఆహారంగా వేస్తుంటారు. బతుకున్న చేపలను మాత్రమే వేటాడటం ఈ చేప యొక్క ప్రత్యేకత. ఇలా ఏడాది కాలం లోపు పెంచితే సుమారు కిలో నుంచి 10 కిలోల వరకు ఒక్కో చేపపెరుగుతుందని రైతులు అంటున్నారు.





పండు చేపలను ఎగుమతి చేసేందుకు బాక్సులో శుభ్రం చేస్తున్న దృశ్యం

చిన్న, సన్నకారు రైతులు మొగ్గు

వనామీ పెంపకంలో వైట్ స్పాట్, విబ్రియో, వైరస్‌లు వల్ల నష్టాలను చూస్తున్న రైతులకు పండుగొప్ప పెంపకంపై తీర ప్రాంత రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎకరం, రెండు ఎకరాలలో సాగుచేసే వనామీ సాగులో నష్టాలు రావడంతో రైతులు ఎక్కువగా 3, 4 ఎకరాల విస్తీర్ణంలో వీటిని పెంచేందుకు మొగ్గుచూపిస్తున్నారు. పెట్టుబడులు పోగా మిగులుబడి ఉంటుందని రైతులు తెలిపారు.

ఆహారంగా చైనా గొరకలు

పండుచేప కేవలం బతుకున్న చేపలను ఆహారం తింటుంది. దీంతో రైతులు స్థానిక చేపల చెరువులలో బెత్తులు, చైనా గొరకలు ఇతర చిన్న చిన్న మత్స్య జాతికి చెందిన వాటిని ఆహారంగా వేస్తున్నారు. ఇటీవల మేత కొరత ఎక్కువగా ఉండటంతో కొల్లేరు, మచిలీపట్నం, కైకలూరు తదితర ప్రాంతాలనుంచి లారీలపై డ్రమ్ములలో ఆక్సిజన్‌లు పెట్టి బతుకున్న చైనా గొరకలు, చిన్న చేపలను తీసుకువచ్చి పండు చేపలకు ఆహారంగా వేస్తున్నారు.

వనామీలో నష్టపోయి ఈ చేపలను పెంచుతున్నాం

గతంలో ఎకరం చెరువులో వనామీ వేసి తీవ్రంగా నష్టపోయాను. ఈ ఏడాది పండు చేప సాగుచేస్తున్నారు. చెరువులో డీవోలో హెచ్చుతగ్గులు రాకుండా రాత్రి పగలు చెరువు వద్దే ఉండి కంటికి రెప్పలా చూసుకోవాల్సి వస్తుంది.

ఎస్. హరికృష్ణ, రైతు, దొంగపిండి

గొరకలు కోసం ఇబ్బందులు పడుతున్నాం

గత రెండేళ్లుగా పండు చేప సాగు చేస్తున్నాను. ఈ చేపలకు ఇతర రాష్ట్రాలు, విదేశాలలో బాగా డిమాండ్ ఉంది. ఈ చేపలకు ఆహారంగా చైనా గొరకలు కేజీ రూ. 40 పెరిగిపోయింది. వీటికి మేతగా గొరకలు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

ఆర్. నాగరాజు, రైతు, దొంగపిండి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: జక్కరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు నిమిత్తం గురువారం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ అంతరాయంపై వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయ స్థాయిలో జైపూర్‌లో నిర్వహించే నెట్‌బాల్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో జేఎన్టీయూకే తరపున మెన్ అండ్ ఉమెన్ టీమ్స్‌కు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారుల ఎంపికవడం అభినందనీయమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ అన్నారు. బుధవారం కళాశాలలో క్రీడాకారులను అభినందించారు. నెట్‌బాల్ ఉమెన్ టీంలో పీఆర్ విజయ సాహిత్య, ఆర్.అఖిల శ్రీవల్లి, వి.దేవిశ్రీ, బి.చైతన్యలహరి, మెన్స్ టీంలో బి.జోషి, పి.ప్రమోద్ కుమార్, ఎస్.లిఖిత్ చౌదరి, ఎం.తేజప్రభాస్ ఉన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ఉండి: మతిస్థిమితం లేని తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామని ఎస్సై నసీరుల్లా తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన 42 ఏళ్ల వయసున్న చింతల రాము అనే వ్యక్తి ఈ నెల 2న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు.ఇ దే విధంగా నాలుగేళ్ళ క్రితం కూడా ఇంటి నుండి బయటకు వెళ్లిన రాము మూడు రోజుల్లో తిరిగి ఇంటికి వచ్చేశాడు. అయితే ఈ సారి రాకపోవడంతో రాము భార్య పద్మ పోలీసులను ఆశ్రయించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దిరుసుమర్రు గ్రామానికి చెందిన కవురు కోటేశ్వరరావు (64) పెరాలసిస్, బీపీలతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఈ నెల 3 మనస్థాపంతో పురుగుమందు సేవించాడు. కుటుంబసభ్యులు కోటేశ్వరరావును భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఉదయం కోటేశ్వరరావు మృతి చెందినట్లు ఆయన కుమారుడు కవురు లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో అఖండ జ్యోతి



అమ్మవారి ఆలయం వద్ద అఖండ జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసం సందర్భంగా అఖండ జ్యోతి కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి అర్ధ మండలి దీక్ష కార్యక్రమంలో 111 మంది భక్తులు అమ్మవారి మాల ధరించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

ఆకివీడు: క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగాలంటే, గ్రామాలు ప్రగతి పథంలో నడవలంటే స్థానిక ప్రజాప్రతినిధుల కృషే ముఖ్యమని ఎంపీపీ కఠారి జయలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ సమావేశ హాలులో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా గుర్తించి, చర్చించి పరిష్కారానికి కృషిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మండల, జెడ్పీ, ఎమ్మెల్యే నిధులు, ఇతర నిధుల కోసం ప్రయత్నించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఎంపీడీఓ సుహాసిని మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరయ్యే ముందు ఆయా గ్రామాల్లోని సమస్యలను, అభివృద్ధి పనుల్ని పరిశీలించి సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. తొలుత మండలంలోని వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. విద్యుత్ వినియోగంలో సోలార్ విధానం ప్రతి ఇంటికీ అమర్చుకునే విధంగా వినియోగదారులు కృషి చేయాలని ఏఈలు ప్రసాదరాజు, సూచించారు. ఆర్ అండ్ బీ ఏఈ శ్రీహరిరాజు మాట్లాడుతూ మండలంలోని రహదారులు మరమ్మతులుకు రూ.80 లక్షలు మంజూరయ్యాయన్నారు. గతంలో మంజూరైన పెదకాపవరం–గంటలరాయుడుపేట, ఆకివీడు–సిద్ధాపురం, ఏలూరుపాడు వంతెన వద్ద నుండి చెరుకుమిల్లి వరకూ రహదారుల విస్తరణ, అభివృద్ధిపనుల్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి మాట్లాడుతూ పెదకాపవరం, కోళ్ళపర్రు గ్రామాల్లో మైక్రో వాటర్ ప్లాంట్‌ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. మైక్రో వాటర్ ఫిల్టర్ల ద్వారా మంచి నీటిని కుళాయిల ద్వారా సక్రమంగా సరఫరా చేయవచ్చని చెప్పారు. అన్ని గ్రామాల్లో మైక్రో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. అన్ని గ్రామాల్లో జ్వరాలు ఉన్నాయని, వాటి నివారణకు వైద్యం అందజేస్తున్నామని వైద్యాధికారి రాజశేఖర్ చెప్పారు. ఉపాధి హామీ నిధులు రూ. 2.95 కోట్లతో వివిధ అభివృద్ధిపనులకు తీర్మానం చేయగా పనులు ప్రారంభించామని టెక్నికల్ అసిస్టెంట్ ఓమేగా రాజు చెప్పారు. తహసీల్దార్ ఎన్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు సైదాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్‌సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి

సోమేశ్వరుడికి పంచామృతాభిషేకాలు



పంచారామక్షేత్రం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి →

భీమవరం (ప్రకాశం చౌక్): కార్తికమాసోత్సవాల్లో భాగంగా గుణుపూడి సోమేశ్వరజనార్ధనస్వామి ఆలయంలో బుధవారం మంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి సోమేశ్వరస్వామి, జనార్ధన స్వామి, అన్నపూర్ణమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి రామకృష్ణంరాజు ఆలయ అధికారులు అర్చకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

భీమవరం: విద్యా రంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం భీమవరం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.3,480 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ చదువుతున్న విద్యార్థులకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని, యువగళం పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తానని ఇచ్చిన హామీని తక్షణం అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావుకు అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సహాయ కార్యదర్శి బి.గణేష్‌కుమార్, జి.సిరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో డీఆర్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఆకివీడు: ఖాళీగా ఉన్న రైల్వే ఉద్యోగ పోస్టులను నిరుద్యోగులతో భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనూష్ డిమాండ్ చేశారు. రైల్వే శాఖ రీ–ఎంగేజ్‌మెంట్ పద్ధతిని అమలుజేయాలని తీసుకున్న నిర్ణయంపై రాష్ట వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిరసన వ్యక్తంచేసి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. యువత సామర్థ్యాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయంను ఉపసంహరించుకోవాలన్నారు. రైల్వే శాఖలో 2.98 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా అర్హత కలిగిన నిరుద్యోగులను తొక్కేసి, కాంట్రాక్టు పద్ధతిలో విశ్రాంతి ఉద్యోగుల్ని తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తానని మోడీ కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల్ని మోసం చేస్తుందని మండిపడ్డారు. రైల్వేలోని అన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళ్యాణ్, గణేష్, వెంకటేష్, సాయిఫణి, కార్తీక్, లోకేష్ పాల్గొన్నారు.



స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

హెచ్ఎంలకు శిక్షణతో తీవ్ర ఒత్తిడి

ఉండి: ఉండి మండలం ఉణుదుర్రు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు(ఎఫ్ఏసీ) టీవీ రత్నకుమార్ బుధవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై మండిపడుతున్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రధానోపాధ్యాయుడు మృతి చెందాడని వారు ఆరోపిస్తున్నారు. ఓ పక్క తీవ్ర ఒత్తిడి పెడుతూ మరో వైపు శిక్షణా కార్యక్రమాలు అంటూ దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యమేమనని అన్నారు. వయసుపైబడిన ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అంటే కనీస వసతులు ఉండాలని, కానీ కనీస సదుపాయాలు లేని ఓ మారుమూల ప్రాంతంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయుడి మరణానికి కారణమయ్యారని అన్నారు. నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీఎ సత్యనారాయణరాజు మాట్లాడుతూ సౌకర్యాలు లేని చోట్ల ప్రధానోపాధ్యాయుల శిక్షణ నిర్వహించడం వల్లే ప్రధానోపాధ్యాయుడు మృతి చెందాడని మండిపడ్డారు. గతంలో ఎన్నో అనుభవాల దృష్ట్యా ప్రధానోపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను నిలిపివేయాలని, అనారోగ్య కారణాలతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటూ వాపోయారు.

ప్రతి ఇంటికీ రీసర్వే ద్వారా పాస్‌బుక్

ఉండి: రీసర్వే పూర్తి కాగానే ప్రతి ఇంటికీ పాస్‌బుక్ జారీ చేస్తామని జిల్లా సర్వే అధికారి కె.జాషువా అన్నారు. బుధవారం ఉండి మండలం కోలమూరులో సర్పంచ్ నడింపల్లి సత్యవతిరామకృష్ణంరాజు అధ్యక్షతన రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వే పారదర్శకంగా నిర్వహించి ప్రతి ఒక్కరికీ వారికి సంబంధించిన పత్రాలు అందిస్తామన్నారు. అలాగే ఇంటింటికీ కూడా పాస్‌బుక్‌లు అందిస్తామని వాటిని బ్యాంకు లోన్లు తీసుకునేందుకు కూడా వాడుకోవచ్చునని తెలిపారు. అయితే పొలాల విషయానికి వస్తే ప్రతితీ కొలతలోనూ సుమారుగా 5 సెంట్ల వరకు వ్యత్యాసం ఉండే అవకాశం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని శాటిలైట్స్, రోవర్స్ సహాయంతోనూ రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. కోలమూరులో అన్ని ప్రభుత్వ భూములు(కాలువలు,రోడ్లు) కలుపుకుని 463.47 ఎకరాల ఉందన్నారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించేందుకు సర్వేయర్ ఉండాలని గ్రామస్థులు కోరడంతో తప్పకుండా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సర్వేయర్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉపసర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు, తహసీల్దార్ కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



కోలమూరు గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి జాషువా

రాష్ట్రస్థాయి అండర్–17 నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

భీమవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–17 నెట్‌బాల్ పోటీలకు భీమవరం సీఎస్ఎన్ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీంఖాన్ విలేకర్లకు చెప్పారు. బుధవారం కళాశాల వద్ద రాష్ట్రస్థాయి పోటీలకు బాలుర విభాగంలో ఎంపికైన జి త్రినాథ్, డి రాజేష్, బాలికల విభాగంలో ఎంపికైన వై వినీలవర్షిని, వి దీప్షిషలను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. రాష్ట స్థాయి నెట్‌బాల్ పోటీలు ఈనెల 10వ తేదీ నుంచి12 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో, బాలికల పోటీలు అన్నమయ్య జిల్లా సీటీఎం మదనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, సలీంఖాన్, కోచ్ దావుద్‌ఖాన్ తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మొగల్తూరులో క్షుద్రపూజల కలకలం

నరసాపురం రూరల్: మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలి రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు నిమ్మకాయలు, కోడిగుడ్లు, మసిబొగ్గు, ఎండుమిర్చి, పసుపు, కుంకుమ, అన్నంముద్దలు రోడ్డుపై వేశారు. బుధవా రం ఉదయం స్కూల్‌కువెళ్లే చిన్నారులు, మార్కెట్‌కు వెళ్లే ప్రజలు ఒక్కసారిగా భయపడ్డారు. మొగల్తూరు జాతీయరహదారిపై గతంలోనూ క్షుద్రపూజలు చేసిన దుండగులు కొంతకాలం తరువాత మళ్లీ పూజలు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాలకొల్లు సెంట్రల్: దేశంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అలాగే ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ వన్ అండ్ టు కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ, నెహ్రూ యువజన కేంద్రం ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణ, మొక్కలు నాటడంపై వ్యాసరచన, అలాగే యాంటీ డ్రగ్స్ అవగాహనపై పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఏలూరు యువజన కేంద్రం వలంటీర్ కె.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ, పాల్గొన్నారు.